క్లుప్తంగా

గడివేముల ఎస్ఐగా నాగార్జునరెడ్డి



గడివేముల: గడివేముల ఎస్ఐగా సీసీ నాగార్జునరెడ్డిని నియమిస్తూ జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న బీటీ వెంకట సుబ్బయ్య నందివర్గం స్టేషన్‌కు బదిలీ య్యారు. నాగార్జున రెడ్డి నంద్యాల మండలం గోస్పాడు పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్నారు. త్వరలోనే బాధ్యతలు చేపట్టనున్నట్లు తెలిసింది. బదిలీల్లో భాగంగా ముందుగా వరప్రసాద్‌ను నియమించినట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. మూడు రోజుల్లోనే ఉత్తర్వులు మార్చి నాగార్జునరెడ్డిని నియమించారు.

పెళ్లి పత్రికలు పంచుతూ..

పాణ్యం: మరో రెండు రోజుల్లో జరిగే తన పెళ్లికి గ్రామంలో మిత్రులు, బంధువులకు పెళ్లి పత్రికలు పంచుతున్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. తమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన అభినయ్ పెళ్లి ఈనెల 18న ఉండటంతో గురువారం స్కూటీపై తిరుగుతూ గ్రామంలో పెండ్లి పత్రికలు పంచుతున్నాడు. గ్రామంలో హైవే దాటుతుండగా కర్నూలు నుంచి తిరుపతి వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన అభినయ్‌ను కుటుంబీకులు కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

టూటౌన్ సీఐ బాధ్యతల స్వీకరణ

బొమ్మలసత్రం: నంద్యాల టూటౌన్ సీఐగా షేక్ ఇస్మాయిల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల ట్రాఫిక్ సీఐగా పనిచేస్తున్న షేక్ ఇస్మాయిల్‌ను ఉన్నతాధికారులు టూటౌన్‌కు బదిలీ చేయడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు.

శునకానికి అంత్యక్రియలు

నంద్యాల(వ్యవసాయం): పన్నెండు ఏళ్లుగా పెంచుకుంటున్న శునకానికి పట్టణానికి చెందిన డాక్టర్ అపర్ణ కుటుంబ సభ్యులు గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. అల్లారు ముద్దుగా పెంచుకున్నామని, వయో భారంతో మృతి చెందడంతో తమ వ్యవసాయ పొలంలో హిందూ సంప్రదాయ ప్రకారం ఖననం చేశామని యజమానులు తెలిపారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): జిల్లా ప్రభుత్వాసుపత్రి, మెడికల్ కళాశాలలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలవెంకట్ డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఐటీయూ కార్మికుల పక్షాన పోరాడుతుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో, మెడికల్ కళాశాలలో, సెక్యూరిటీ, శానిటేషన్ వర్కర్స్ సమస్యలు పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. సమావేశంలో నాయకులు ప్రసాద్, పద్మ, చెన్నయ్య, బాలకయ్య, ఆది, సుమలత, గురుశేఖర్ పాల్గొన్నారు.

పొలాల్లో పాద ముద్రల కలకలం

కొత్తపల్లి: మండలంలోని ఎదురుపాడు గ్రామ సమీపంలోని మొక్కజొన్న పొలాల్లో కొన్ని పాద ముద్రలు గురువారం కలకలం రేపాయి. ఎదురుపాడు గ్రామానికి చెందిన రైతు చంద్రగౌడ్ మొక్కజొన్న పొలంలో నీరు పెట్టేందుకు వెళ్లాడు. పొలంలో పులి పాద ముద్రలు ఉన్నాయంటూ సమీపంలోని రైతుల దృష్టికి, ఆ తర్వాత అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆత్మకూరు ఎఫ్ఎస్ఓ జ్యోతి స్వరూప్ ఘటనా స్థలానికి చేరుకొని డ్రోన్ కెమెరాలతో పాదముద్రల కోసం గాలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాదముద్రలను చూసి రైతులు ఆందోళన పడొద్దన్నారు. అవి పులి పాదముద్రలా? అడవి పిల్లి పాదముద్రలా? అనేది తేలాల్సి ఉందన్నారు. ప్రస్తుతం 10 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశామని, 20 మంది సిబ్బందితో రాత్రి పొలాల్లో గాలింపు చర్యలు చేపడుతున్నామని, రైతులు భయపడొద్దని భరోసా ఇచ్చారు.

మహానందిలో భక్తజన సందడి

మహానంది: శ్రావణమాసం, స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా సెలవు ఉండటంతో మహానందిలో గురువారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

నంద్యాల(న్యూటౌన్): మండలంలోని పోలూరు గ్రామంలో వెలసిన వీరభద్రస్వామి దేవస్థానంలో గురువారం భద్రకాళి సమేత వీరభద్రస్వామి కల్యాణం కమనీయంగా సాగింది. శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని స్వామి వారి లీలా కల్యాణ మహోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని తిలకించారు. కార్యక్రమంలో నిర్వాహకులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సి. బెళగల్ మండలం పోలకల్ సచివాలయం వద్ద స్వతంత్ర్య వేడుకల సంబరాల్లో భాగంగా జాతీయ జెండా ప్రదర్శన

గుండె నిండా జెండా

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఊరూరా పండుగలా జరుపుకున్నారు. దేశభక్తి ఉప్పొంగేలా వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లు, పాఠశాలల్లో గురువారం జాతీయ జెండా ఎగురవేశారు. స్వాతంత్య్ర సమరయోధుల పోరాటం, త్యాగాలను అధికారులు, వక్తలు కొనియాడారు. దేశభక్తి గేయాలు హోరెత్తాయి. మహనీయుల వేషధారణలో చిన్నారులు అలరించారు.

- వాడవాడలా స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు
- మురిసిన మువ్వన్నెల పతాకం
- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

కల్లూరు: పంద్రాగస్టు వేడుకల్లో భాగంగా గురువారం కల్లూరు గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో వాడవాడలా జాతీయ జెండాను ఎగురవేశారు. కల్లూరు అర్బన్ 27వ వార్డు రవీంద్ర స్కూల్ సమీపంలో ఉన్న పార్కులో రిటైర్డ్ ఎంప్లాయిస్, పెన్షన్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హాజరై జాతీయ జెండాను ఎగురవేశారు. ఎందరో త్యాగధనుల ఫలితంగా దేశానికి స్వాతంత్య్రం వచ్చిందని కొనియాడారు.

- కల్లూరు అర్బన్ 19వ వార్డులో ఉన్న మేయర్ క్యాంపు కార్యాలయంలో నగర మేయర్ బీవై రామయ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు. నగర ప్రజలందరికీ ఆయన స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.
- కల్లూరు వీకర్‌సెక్షన్ కాలనీలో నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరై జెండాను ఆవిష్కరించి సెల్యూట్ చేశారు. కార్పొరేటర్ శ్వేతారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



వీకర్‌సెక్షన్ కాలనీలో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి తదితరులు



మేయర్ క్యాంపు కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న మేయర్ బీవై రామయ్య తదితరులు



ఎంపీడీఓ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న ఎంపీపీ బోయ శారద, అధికారులు



దామోదర్ ఆయిల్ మిల్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న అధినేతలు మహేశ్వరరెడ్డి, రాజేష్‌రెడ్డి



కల్లూరు అర్బన్ 27వ వార్డులో జెండాను ఎగురవేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



ఓర్వకల్లులో జెండా ఆవిష్కరణ చేస్తున్న తహసీల్దార్ వెంకటరమణ



పూడిచెర్లలో విద్యార్థులకు నోటు బుక్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం



కోడుమూరు ఎంపీడీఓ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రూతమ్మ, జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి

ఓర్వకల్లులో..

ఓర్వకల్లు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట తహసీల్దార్ వెంకటరమణ, మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట ఎంపీపీ తిప్పన్న, ఎంపీడీఓ శివనాగ ప్రసాద్, పోలీస్ స్టేషన్‌లో కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు వారి సిబ్బందితో కలసి జెండా ఆవిష్కరించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో డాక్టర్ మంజుల వారి సిబ్బందితో కలసి జెండాను ఆవిష్కరించారు. జిల్లాపరిషత్ హైస్కూల్ ఓర్వకల్లులో ఓంకార్ యాదవ్, ప్రధాన ఉపాధ్యాయులు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, కేతవరం, ఉప్పలపాడు, సోమయాజులపల్లె, హుసేనాపురం, మీదివేముల గ్రామాల్లోని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, సర్పంచులు విద్యాకమిటీ చైర్మన్‌లు జెండాను ఆవిష్కరించారు. గవర్నమెంట్ హైస్కూల్ లొద్దిపల్లెలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి రూ.10 వేలు, లొద్దిపల్లె వై నాగేంద్రనాత్ రెడ్డి రూ.16 వేలు బాగా చదువుతున్న పేద విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గుట్టపాడు గ్రామంలో గ్రామ సర్పంచు మోహన్‌రెడ్డి విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. పూడిచెర్ల జెడ్పీ హైస్కూల్‌లో కమతం వెంకటపతి, కమతం అనిత విద్యార్థులకు నోటు బుక్స్, పెన్, పెన్సిల్‌తో పాటు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచు పుల్లా లలితమ్మ, శివుడు, పుల్లారెడ్డి, పలువురు గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రంగనాథ్ గౌడ్, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, శాఖలకు సంబంధించిన అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోడుమూరులో..

కోడుమూరు రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గాడి రూతమ్మ, జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి, ఎంపీడీఓ చంద్రశేఖర్, కోడుమూరులోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేష్ నాయక్, మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచు భాగ్యరత్న, పోలీస్‌స్టేషన్‌లో సీఐ మన్సురుద్దీన్, సెబ్ స్టేషన్‌లో సీఐ రామాంజినేయులు, ఆయా పాఠశాలల్లో పేరెంట్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు జెండావిష్కరించారు. కోడుమూరు మోడల్ స్కూల్లో చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులక ప్రిన్సిపాల్ జ్ఞాపికలను అందజేయగా, అమడగుంట్ల హైస్కూల్లో చదువు, క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులకు రిటైర్ట్ ఎస్ఈ అమడగుంట్ల క్రిష్టారెడ్డి బహుమతులను అందజేశారు. జాతీయ జెండావిష్కరణ కార్యక్రమాల్లో కోడుమూరు ఉప సర్పంచు మాదులు, ఎంఈఓ శరభయ్య, ఏఈ రంగస్వామి, ఏపీఓ మోదీన్‌బాషా, ఈఓ అజయ్ భాస్కర్, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరు మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, తహసీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రామాంజినేయులు, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ హనుమంతయ్య, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ విజయసింహారెడ్డిలు మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. గూడూరులో మదర్సా-ఎ-సిరాజుల్ ఉలుమ్ ఆధ్వర్యంలో ముస్లింలు 500 అడుగుల జాతీయ జెండా ఊరేగింపు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ పీఎస్.అస్లామ్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

పాణ్యంలో..

పాణ్యం: మండల కేంద్రంలో పాణ్యం సీఐ వంశీధర్, ఎస్ఐ అశోక్ జాతీయ జెండాను ఎగరవేశారు. అలాగే తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి జెండాను ఆవిష్కరించి స్వాతంత్య్ర సమరయోధుల త్యాగాలను కొనియాడారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీడీఓ దస్తగిరి, ఎంపీపీ ఉసేన్ బీ, ఎంపీటీసీలు వేడుకల్లో పాల్గొన్నారు. పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓ ఆనందరావు పాల్గొన్నారు. ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంఈఓ కోటయ్య జెండా ఎగరవేశారు. కొండజుటూరు గ్రామంలో జెడ్పీటీసీ సద్దల సరళమ్మ, సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డి జెండాను ఎగరవేశారు. పలు గ్రామాల్లో పంద్రాగస్టు వేడుకల్లో భాగంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



జెండాను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి



కొండజుటూరులో జెండాను ఎగురవేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ



బురాన్‌దొడ్డి జెడ్పీ హైస్కూల్లో విద్యార్థుల ప్రదర్శన



సి.బెళగల్ తహసీల్దార్ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న తహసీల్దార్ విజయశ్రీ తదితరులు



సి.బెళగల్‌లో జెండా ఆవిష్కరిస్తున్న ఎస్ఐ తిమ్మారెడ్డి



జాతీయ నాయకుల చిత్రపటాలతో పలుకుదొడ్డి స్కూల్ విద్యార్థుల ర్యాలీ

సి.బెళగల్:

సి.బెళగల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విజయశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ క్రిష్ణమూర్తి, మండల రెవెన్యూయ అధికారులు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విద్యార్థులకు స్వీట్లను పంపిణీ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ తిమ్మారెడ్డి జెండాను ఆవిష్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ బొంతల మునెప్ప, ఎంపీడీఓ రాముడు, ఈఓఆర్డీ సందీప్, ఎంపీటీసీ సభ్యులు రవికుమార్, జాతీయ జెండాను ఆవిష్కరించారు. సి.బెళగల్, బురాన్‌దొడ్డి జెడ్పీ పాఠశాలలో ఎస్ఎంసీ చైర్మన్లు గోవిందు, డిష్ వెంకటేషలు, ఉపాధ్యాయులు, స్థానికులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్లో 10వ తరగతి పాఠశాల టాపర్స్‌కు దాతలు నగదు బహుమతులను అందజేశారు. గుండ్రేవులలో జరిగిన వేడుకలలో విద్యార్థులుకు సర్పంచ్ మాధవి విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. పలుకుదొడ్డిలో పాఠశాల అభివృద్ధికి రూ.10 వేలు, విద్యార్థులకు 300 నోట్ పుస్తకాలను దాత దేవనందం అందజేయడంతో వారిని హెచ్ఎం అనుమంతు, టీచర్ రాము సన్మానించారు.



కోడుమూరు పోలీస్‌స్టేషన్‌లో జెండా ఆవిష్కరిస్తున్న సీఐ మన్సురుద్దీన్, ఎస్ఐ శ్రీనివాసులు



గూడూరు 500 అడుగుల జాతీయ జెండాతో ప్రదర్శన నిర్వహిస్తున్న ముస్లింలు



గూడూరు మున్సిపల్ కార్యాలయంలో జెండావిష్కరిస్తున్న చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు

గడివేములలో..

గడివేముల: మండల కేంద్రం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విద్యా సాగర్, ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య ఆయా గ్రామాల్లోని సచివాలయాల వద్ద గ్రామసర్పంచ్‌లు జెండాను ఎగరవేశారు. కస్తూర్బా పాఠశాలలో స్పెషల్ ఆధికారి రుబీనా ఆధ్వర్యంలో విద్యార్థినులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మంచి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుతులు అందజేశారు. అలాగే గడివేముల పొదుపు కార్యాయలంలో అధ్యక్షురాలు బిడుదూరి అనురాధ, ఏపీఎం హజరత్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. ఎంఈఓ కార్యాలయంలో వద్ద ఎంఈఓ విమలా వసుంధరదేవి, ఉపాధ్యాయులు జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. గడిగరేవుల సచివాయం వద్ద ఉపసర్పంచ్ గోదా ప్రసాద్, కో అప్షన్ సభ్యుడు ఉశేన్‌భాషలు జెండాను ఆవిష్కరించారు. స్థానిక జెడ్పీ స్కూల్‌లో పీఎంసీ చైర్మన్ లింగన్నతో పాటు హెచ్‌ఎం జెండాను ఎగరవేసి, విద్యార్థులకు బహుమతులను అందజేశారు.స్థానిక రాజరాజేశ్వరీ పాఠశాల కరస్పాండెంట్ రామేశ్వరరావు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా గడివేముల ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య, కానిస్టేబుల్ చెన్నయ్యలు జిల్లా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి నంద్యాలలో ఉత్తమ అవార్డులు అందుకున్నారు.



గడివేముల ఎంపీడీఓ కార్యాలయం వద్ద జెండాకు వందనం చేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, అధికారులు

జెండాకు అవమానం..

మండల కేంద్రమైన బీసీ హాస్టల్‌లో ఉదయం వార్డెన్ వెంకటపతి ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి స్వాతంత్య్ర దినోత్స వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సాయంత్రంలోగా జెండాను తీసివేయాల్సింది అయితే చీకటి పడినా జాతీయ జెండాను తొలగించలేదు.అదే విధంగా భారతీయ స్టేట్ బ్యాంక్‌పై ఇలాగే జాతీయ జెండాకు అవమాన పరిచారు. జాతీయ జెండాకు అవమాన పరిచిన వార్డెన్, బ్యాంక్ మేనేజర్‌పై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



గడివేముల బీసీ హాస్టల్‌లో పొద్దుపోయినా జెండాను తొలగించని దృశ్యం

ఎడారి ఓడ.. బతుకు బాట!

దొర్నిపాడు: పొట్టకూటి కోసం నెల్లూరుకు చెందిన శీను, మున్ని వందల కిలోమీటర్లు నడక సాగిస్తున్నారు. ఏడారి ఓడైన ఒంటెను ఊరూరా తిప్పుతూ ఇంటింటికీ తిరిగి వారిచ్చే తిండిగింజలు, డబ్బులు తీసుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో వారు గురువారం మండంలోని పలు గ్రామాల్లో తిరిగారు. మండు టెండల్లో ఎడారి ఓడలతో కలిసి నడక కొనసాగిస్తూ వస్తున్నారు. దారి వెంట ఒంటెలకు చెట్ల ఆకులను ఆహారంగా తినిపించుకుంటూ ఊరురా తిరుగుతామని చెబుతున్నారు.



మండుటెండల్లో ఒంటెలతో కలిసి నడుస్తున్న దృశ్యం

పెద్దాసుపత్రిలో సబ్‌స్టేషన్ ప్రారంభం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల డయాగ్నోస్టిక్ బ్లాక్ వద్ద గురువారం 500 కేవీఏ సబ్‌స్టేషన్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సబ్‌స్టేషన్ వల్ల కొత్తగా 3 ఎక్స్‌రే మిషన్లు ప్రారంభించే అవకాశం ఉందన్నారు. సిటీ స్కాన్, అల్ట్రాసౌండ్ మిషన్, బయోకెమికల్ పెథలాజికల్ మిషన్లకు కరెంటు సమస్య నుంచి విముక్తి కలిగిందన్నారు. ఆసుపత్రిలో అత్యవసర సేవలకు, క్రిటికల్ కేర్ బ్లాక్, డయాగ్నోస్టిక్ బ్లాక్‌లకు నిరంతర విద్యుత్ సరఫరా అవుతుందని చెప్పారు. తద్వారా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుతాయన్నారు. డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శివకుమార్, ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

అనంతపురం వాసి మృతదేహం లభ్యం

కర్నూలు: కర్నూలు శివారులోని ఔటర్ రింగ్ రోడ్డులోని టిడ్కో ఇళ్లకు సమీపంలో కాదంబరి టౌన్‌షిప్ వద్ద అనంతపురం వాసి మద్దిలేటి గారి నాగభూషణం (45) మృతదేహం లభ్యమైంది. గురువారం ఉదయం స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కర్నూలు అర్బన్ తాలూకా సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి మృతదేహాన్ని ఇక్కడ పడవేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడు అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం ఆవులపల్లికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ఫోన్ ద్వారా అతని కుటుంబ సభ్యులకు సమాచారం చేయవేయగా తల్లి చౌడమ్మ కర్నూలుకు చేరుకున్నారు. మృతుని తల వెనుకభాగంలో బలమైన గాయాలు ఉన్నాయి. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.